



కాకినాడ.. ఏచూరి!

సీతారాంకి కాకినాడతో ఎంతో అనుబంధం

తల్లిదండ్రులను కలవడానికి పలుమార్లు రాక




సామర్లకోటలో సీతారాం ఏచూరితో తల్లి కల్పకం (ఫైల్)

2010లో సీపీఎం కార్యాలయం ప్రారంభానికి హాజరు

కడియంలోని జేగురుపాడులో జన్మించిన తల్లి కల్పకం

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారన్న వార్తతో సీపీఎం నేతలు, వారి కుటుంబంతో పరిచయం ఉన్నవారంతా విషాదంలో మునిగిపోయారు. సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన తల్లి ఇక్కడే నివాసం ఉండడంతో ఆయన వచ్చి వెళుతుండేవారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



ఏచూరి టవర్స్

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కాకినాడ అంటే చాలా ఇష్టం. ఆయన కుటుంబానికి కాకినాడలో ఏచూరి టవర్స్ పేరుతో ఓ అపార్ట్‌మెంట్ కూడా ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు కాకినాడలోనే ఉండేవారు. ఆయన తల్లి కల్పకం ఏచూరి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జేగురుపాడు. అయితే ఉద్యోగ రీత్యా ఆమె కాకినాడలోనే ఉండేవారు. వారు నిర్మించుకున్న ఏచూరి టవర్‌లోనే నివాసం ఉండేవారు. సీతారాం తండ్రి కూడా తర్వాత కాకినాడలోనే ఉండేవారు. అయితే కొన్నేళ్ల కిందట వీరు మరణించారు. అయితే తల్లి కోసం పలుసార్లు సీతారాం ఏచూరి కాకినాడకు వచ్చేవారు. అదే సమయంలో జిల్లా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. 2010లో కాకినాడలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరగ్గా, సీతారాం ఏచూరి పాల్గొన్నారు. తల్లి అంటే సీతారాం ఏచూరికి ఎంతో ఇష్టం. ఎక్కడున్నా ఫోన్‌లో తల్లిని పలకరించేవారని జిల్లా పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు. సీతారాం ఏచూరి అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారని, కష్టసుఖాలు అడిగేవారని ఆయనతో పనిచేసిన పలువురు జిల్లా నేతలు గుర్తుచేసుకుంటున్నారు. అయితే తల్లి మరణానికి ముందే కాకినాడ కుళాయి చెరువు ఎదురుగా ఉన్న ఏచూరి టవర్స్‌ను విక్రయించేసినట్టు అక్కడ ఉన్న వారు పేర్కొన్నారు. ఏచూరి టవర్స్ పేరుతో ఆయన జ్ఞాపకం మిగిలే ఉంది.

సామర్లకోటలోనూ పరిచయాలు

సామర్లకోట, సెప్టెంబరు12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఏచూరి కుటుంబ సభ్యులకు సామర్లకోటతో అనుబంధం ఉంది. కంచి మహాసంస్థానం వ్యవస్థాపకులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి కుటుంబంతో సీతారాం ఏచూరి తల్లితండ్రులు సోమయాజీ ఏచూరి, కల్పకంలకు చిరకాల సాన్నిహిత్యం ఉంది. సీతారాం ఏచూరి తల్లితండ్రులు గణపతిశాస్త్రి ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అదే సమయంలో సీతారాం మేనమామ విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా కూడా తరచూ సామర్లకోటకు రాకపోకలు సాగించేవారు. అప్పుడప్పుడూ వారి వెంట సీతారాం ఏచూరి కూడా తన కుటుంబ సన్నిహితులైన గణపతిశాస్త్రి కుటుంబ సభ్యుల దగ్గరకు వచ్చేవారని చెబుతున్నారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కంచిమహా సంస్థానం నిర్వాహకులు చంద్రాభట్ల పతంజలి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సీతారాం ఏచూరి యోగక్షేమాలు తెలుసుకున్నట్టు చెప్పారు.



నమో..వినాయక

ప్రత్యేకాలంకరణలో..

అయినవిల్లి, సెప్టెంబరు 12: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు గురువారం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. విశాఖపట్నానికి చెందిన వెంకట పరమేశ్వరరావు బృందం కోలాటం నిర్వహించారు. చిన్నారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

స్వర్ణ శోభితం



అమలాపురం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో గురువారం సాయంత్రం కనిపించిన అద్భుత దృశ్యం ● అమలాపురం టౌన్

లంకల్లోకి నీరు

ముంపులో ప్రధాన కాజ్‌వేలు..
స్తంభించిన రాకపోకలు
లంకల్లో ఇబ్బందులు
పడవలపైనే ప్రయాణాలు
పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్



ముమ్మిడివరం: లంకాఫ్ ఠాణేలంకలో వరదనీటిలో మత్స్యకార కాలనీ



పి.గన్నవరం: గుద్దాయిలంకలో..



పి.గన్నవరం: కె.ఏనుగుపల్లిలో నీట మునిగిన అంగన్‌వాడీ స్కూల్



ఆలమూరు: జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్‌లో ముంపులో ఆలయాలు



ముమ్మిడివరం: లంకాఫ్ ఠాణేలంకలో నీటిలో అరటి తోట



మామిడికుదురు: బి.దొడ్డవరంలో ఇంటి చుట్టూ చేరిన వరదనీరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. లంక గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకు వస్తుండడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోనసీమ జిల్లా పరిధిలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి ఉన్న కాజ్‌వేలన్నీ దాదాపు మునిగిపోయాయి. వరద తీవ్రతపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సమీక్షించారు. వరద ప్రభావిత గ్రామాల్లో ఉన్న ప్రత్యేక అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో లంక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. నదీ పరివాహక లంక గ్రామాల్లోని కొబ్బరి తోటల్లో రాత్రివేళల్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. రైతులు ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో కొందరు వ్యక్తులు ప్రత్యేక పడవల సహాయంతో దింపులు తీసేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువులకు దాణా కరువై సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండుగడ్డి, పచ్చగడ్డి లభ్యత లేకపోవడంతో పశువులు దాణా సమస్యను ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని కోరుతున్నారు. రేవుల వద్ద ఉన్న వ్యాపార సంస్థలు ముంపునకు గురయ్యాయి. కోటిపల్లి రేవు, సఖినేటిపల్లితో సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న రేవుల్లోని వ్యాపార దుకాణాల్లోకి వరదనీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేవుల్లో రాకపోకలు సైతం నిలిపివేశారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద వరద నీటి ప్రవహం నిలకడగా కొనసాగుతుంది. భద్రాచలం వద్ద అదే పరిస్థితి ఉన్నప్పటికీ మళ్లీ వరద పెరిగే అవకాశం ఉందన్న అధికారుల హెచ్చరికలతో అటు ప్రజలు, ఇటు కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



పి.గన్నవరం: గంటిపెదపూడిలో పడవపై రాకపోకలు



ముమ్మిడివరం: సూచనలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు



పి.గన్నవరం: నాగుల్లంక శివారు పల్లిపాలెంలో..



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద పరవళ్లు తొక్కుతున్న వరదనీరు



కె.ఏనుగుపల్లిలో కొబ్బరి నీటిపాలు

ముంపులోనే గ్రామాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 12: ఉగ్రరూపం దాల్చిన గోదావరి ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం వరకు పెరుగుతూ వచ్చిన వరద మధ్యాహ్నం నుంచి తగ్గింది. అయితే లంక గ్రామాలను వరద చుట్టేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం, చినకందాలపాలెం గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించి రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పడవలపై రాకపోకలు సాగించారు. నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుద్దాయిలంక గ్రామాలలో వీధుల్లోకి వరదనీరు రావడంతో పాటు పలు ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది. మొండెపులంక శివారు మల్లాయపాలెం, జొన్నల్లంక గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కె.ఏనుగుపల్లి కాజ్‌వే నీట మునగడంతో స్థానికులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున కాజ్‌వే నీటమునగడంతో బూరుగులంక రేవును పడవపై దాటి వరద నీటిలో నడిచి గ్రామ ప్రధాన కేంద్రానికి రావడానికి లంక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గంటిపెదపూడిలో నాలుగు, మానేపల్లిలో నాలుగు, కె.ఏనుగుపల్లిలో మూడు, మొండెపులంకలో ఒకటి పడవలు ఏర్పాటు చేశామని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి కె.ముంజవరం, కె.ఏనుగుపల్లి ప్రాంతాలలో వరద ప్రాంతాలను పరిశీలించారు. మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, చినకందాళపాలెం, ఊడిమూడి సంచార జాతుల వారికి మొత్తం 615 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

జల దిగ్బంధంలోనే..

మామిడికుదురు, సెప్టెంబరు 12: గోదావరికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. లంక గ్రామాల్లోని పలు కాలనీలు నీట మునిగాయి. అప్పనపల్లిలోని మొల్లేటివారిపాలెం, ఇందిరమ్మకాలనీ, గెడ్డంవారిపేటలో వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లోని గృహాల చుట్టూ వరద నీరు చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బి.దొడ్డవరంలోని ఇందిరమ్మ కాలనీ, పాశర్లపూడిలోని శ్రీరాంపేట, పల్లవపాలెంలోని గృహాలు వరద నీట నానుతున్నాయి. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాలకు చెందిన ప్రజలు ట్రాక్టరుపై ఉచ్చులవారిపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పెదపట్నంలోని పలు పల్లపు ప్రాంతాలు వరదనీట మునిగాయి. భద్రాచలం, ధవళేశ్వరంలో స్వల్పంగా వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు, బోడసకుర్రు వంతెన వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

లంక గ్రామాల్లో వరద

ముమ్మిడివరం, సెప్టెంబరు 12: గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టినా దిగువన ఉన్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. లంక గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం వరకు వరద నీటిమట్టం పెరుగుతూ సాయంత్రానికి నిలకడ స్థితికి చేరుకుంది. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సిమెంటు రోడ్డు కూనాలంక కనకదుర్గమ్మవారి ఆలయం నుంచి గురజాపులంక తుఫాను షెల్టర్ వరకు నీట మునిగింది. గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, సలాదివారిపాలెం, వలసలతిప్ప తదితర లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. లంకాఫ్ ఠాణేలంకలోని మత్స్యకార కాలనీ నీట మునిగింది. అంతర్గత రోడ్లన్నీ నీటమునగడంతో లంక గ్రామాల ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వరద బాధితులకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మంచినీరు సరఫరా చేస్తున్నారు. వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధికారి మధుసూదనరావు, తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. 36 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలు అందిస్తోంది. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. లంక ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఐదు మెకనైజ్డ్ బోట్లు, ఐదు ఇంజను పడవలు ఏర్పాటు చేశారు. వరద దృష్ట్యా లంక గ్రామాలైన గురజాపులంక, కూనాలంక, చింతావానిరేవు, సలాదివారిపాలెం, వలసలతిప్పలలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కూటమి నాయకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

స్వచ్ఛతను జీవన విధానంగా

మార్చుకోవాలి

రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ● కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతను ప్రతిజ్ఞరూ జీవన విధానంగా మార్చుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పదో విడత స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని పక్షోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులకు, కార్మికులకు ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం వివిధ జిల్లాల్లోని కలెక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా ర్యాలీ, మారథాన్ రన్, వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. 17 నుంచి సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమం కింద మున్సిపల్, గ్రామస్థాయిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ప్రారంభించి శ్రమదానం జరపాలన్నారు. దుకాణ సముదాయాలు, పరిసర ప్రాంతాల్లో శ్రమదానాలు నిర్వహించి చెత్తా, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రిని డంపింగ్ యార్డుకు తరలించాలని చెప్పారు. సంక్షేమ పథకాల నిర్వహణలో సంతృప్తి చెందే విధంగా పారిశుధ్య కార్మికుల భద్రత, శ్రేయస్సును పెంచడానికి వారి సామాజిక రక్షణకు పక్షోత్సవాలు దోహద పడతాయన్నారు. అదనపు ఎస్పీ కేవీఆర్‌పీబీ ప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేంద్రబాబు, డీపీవో డిడ్డి రాంబాబు, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ పనులకు ప్రతిపాదనలు

కలెక్టర్ మహేష్‌కుమార్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న వరదల నేపథ్యంలో జిల్లాలోని ఇరిగేషన్, హెడ్‌వర్క్స్‌శాఖ అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్షించారు. కాల్వలు, హెడ్‌వర్క్స్ శాఖ పరిధిలో ఉన్న పనులకు సంబంధించి చేపట్టాల్సిన మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వరదల సమయంలో రక్షణ పనుల కోసం నిధులు మంజూరు కోరుతూ చేసిన ప్రతిపాదనలను వివరించారు. వీటిలో డ్రైనేజీ శాఖకు సంబంధించి అల్లవరం మండలంలో గండ్లు పూడ్చడానికి రూ.4.38 లక్షలు, ఓడలరేవులో డ్రైనేజీ ఎడమగట్టు మరమ్మతులు రూ.4.90 లక్షలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సాకుర్రు అప్పర్‌కౌశిక డ్రెయిన్ కోసం రూ.4.50 లక్షలు, గోరింకల డ్రెయిన్‌కు రూ.4.94 లక్షలతో ప్రతిపాదించారు. కడలి స్లూయిస్ వద్ద గట్టు లీకేజీని అరికట్టేందుకు రూ.12.88 కోట్లు, వైనతేయ ఎడమగట్టు తొండవరంగరువు, కె.ఏనుగుపల్లి కఠార్‌లంక వద్ద లీకేజీలను అరికట్టేందుకు రూ.1.30 కోట్లు ప్రతిపాదించారు. గౌతమి కుడిగట్టు కుండలేశ్వరం వద్ద రూ.45 కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. బెండా చానల్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కౌశిక కాల్వ మరమ్మతులకు రూ.10 లక్షలు, వాడపాలెం లాక్ షట్టరు రిపేరుకు రూ.5 లక్షలు, కూనవరం చానల్ డ్రైనేజీకి రూ.15లక్షలు, మాగాం చానల్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.5.5లక్షలు, ఇరుసుమండ బ్రాంచికెనాల్ పునర్నిర్మాణానికి రూ.8లక్షలు, ఉప్పూడి బ్రాంచి కెనాల్ పునర్నిర్మాణానికి రూ.8లక్షలు, చినగాడవల్లి బ్రాంచి కెనాల్ పునర్నిర్మాణానికి రూ.8 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వానపల్లిపాలెం, మునిపల్లె, ఉప్పలగుప్తం, సింగరాయచెరువు బ్రాంచి కెనాల్స్ పునర్నిర్మాణాలకు రూ.8 లక్షలు వంతున ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.



అయినవిల్లి: కొండుకుదురు కాజ్‌వేపై వరద నీరు



ముమ్మిడివరం: వివేకానంద వారధి వద్ద వరద ఉధృతి

వరద ముంపులో 11 గ్రామాలు

అమలాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు మండలాలు వరద ప్రభావానికి గురికాగా పదకొండు గ్రామాలు వరద ముంపునకు గురైనట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల చుట్టూ ముంపునీరు చేరిన 89 గృహాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 15 కుటుంబాలను ఆయా కేంద్రాలకు తరలించారు. వరద బాధితులకు 2082 ఆహార పొట్లాలు అందించారు. వీటితో పాటు 38 వేల మంచినీటి ప్యాకెట్లు 2540 మంచినీటి కేన్లను అందించారు. 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 4 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. 163 మంది బృంద సభ్యులు ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రజల రాకపోకల కోసం 66 పడవలను ఏర్పాటు చేశారు.

ఎకరానికి రూ.25 వేలు పరిహారమివ్వాలి
వరద ముంపు ప్రాంతాల్లో వైఎస్ షర్మిల పర్యటన

7లో

కలర్ ఫుల్



గురువారం సూర్యాస్తమయ సమయంలో తూర్పు గోదావరి జిల్లా తీపర్రు వద్ద ఆకాశంలో కనిపించిన సుందర దృశ్యమిది. ఎరుపు, పుసుపు రంగుల మిశ్రమ వర్ణంతో కనిపించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- పెరవలి



ఒకవైపు గోదావరి వరద... మరోవైపు ఆకాశంలో హరివిల్లు ఛాయ. యానాం రాజీవ్‌గాంధీ బీచ్ రోడ్డులో గురువారం సాయంత్రం 6.20 గంటలకు కనిపించిందీ అందమైన దృశ్యం
- యానాం

ఏఎంవీఐపై హత్యాయత్నం కేసులో నిందితుడికి

పదేళ్ల జైలు శిక్ష

అప్పట్లో సంచలనం సృష్టించిన కేసు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 12: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ (ఏఎంవీఐ)పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.విజయబాబు గురువారం రాత్రి తీర్పు చెపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలో ఏఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.చిన్నారావును 2023 మార్చి 17న స్థానిక దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న టాటాఏస్ వాహనం రికార్డును ట్యాబ్‌లో చెక్ చేస్తున్నారు. ఆ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ లేవని గుర్తించిన ఏఎంవీఐ వాహన యజమానిని రికార్డు చూపించమనగా... ఆపి ఉన్న వాహనానికి రికార్డు చూపించాల్సిన అవసరం లేదని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తి దుర్గాప్రసాద్ బొండాలు నరికే కత్తితో చిన్నారావుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం ప్రత్తిపాడులో జరిగింది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి... ప్రత్తిపాడు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న బత్తుల దుర్గాభవాని (13) సాయంత్రం హైస్కూల్ నుంచి తిరిగి వస్తూ దారిలో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన విద్యార్థిని కుటుంబీకులు, గ్రామస్తులు బావి నుంచి బాలికను బయటకు తీసి స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దుర్గాభవానిని ఉదయం మోటారు సైకిలుపై స్కూలు వద్ద వదిలిపెట్టానని, అనంతరం ఊరు వెళ్లి వచ్చేటప్పటికి తన కుమార్తె బావిలో దూకిందని మృతురాలి తండ్రి ఏసుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మరణానికి కారణాలపై విచారణ జరపాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలోకి ఆటో బోల్తా

డ్రైవరు మృతి



ఉమామహేశ్వరరావు (పాత చిత్రం)

ముమ్మిడివరం, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువు నుంచి చిప్పలపాలెం వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఆటో డ్రైవరు మృతి చెందాడు. చిప్పలపాలేనికి చెందిన రమణాతి ఉమామహేశ్వరరావు (40) గురువారం తెల్లవారుజామున మహిపాల చెరువు వెళ్లి తిరిగి వస్తుండగా బొండాయికోడు వద్ద పంట బోదెలో పడింది. దీంతో అతడు మృతి చెందాడు. ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉమామహేశ్వరరావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆటో నడపడం ద్వారా వచ్చే సొమ్ములతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్న ఒక్క ఆధారం కోల్పోవడంతో వారంతా బోరున విలపిస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నరేంద్రగిరి కొండ వద్ద వ్యాన్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... విశాఖపట్నానికి చెందిన కోర్ని శివ (29) ప్రత్తిపాడు వేగుమ్మ గుడి సమీపంలోని అక్క ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా యర్రవరం నుంచి కత్తిపూడి వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఎస్ఐ జగన్మోహన్

8,859 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, సెప్టెంబరు 12: లారీపై అక్రమంగా తరలిస్తున్న 8,859 కిలోల రేషన్ బియ్యాన్ని తొండంగి ఎస్ఐ జగన్మోహన్ గురువారం తన సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరం శివారు రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని లారీపై ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా దాడి జరిపి యాదాల శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు ఎస్ఐ జగన్మోహన్ చెప్పారు. దాడిలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వో శేఖర్, ఎంఎస్‌వో పాల్గొన్నారు.



థర్మల్ డ్రోన్‌తో శోధన

- దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుత పులి
- ట్రాప్ కెమెరాలో గుర్తింపు
- తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి భరణి వెల్లడి



దివాన్‌చెరువు, సెప్టెంబరు 12: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం చిరుత పులి కదలిక చిత్రాలు కనిపించాయని, ప్రస్తుతం అది దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి పాదముద్రను కనుగొని పగ్ ఇంప్రషన్ ప్యాడ్‌లు (పీఐపీ) తీసుకున్నామన్నారు. పులి కదలికలను గుర్తించే నిమిత్తం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలను కొన్ని ప్రదేశాల్లో అమర్చామన్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని నివాస ప్రాంతాలను సిబ్బంది క్రమం తప్పకుండా శోధిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం తీసుకుని వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ లేదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధన కూడా ప్రారంభించినట్టు తెలిపారు. చిరుతపులి కదలికల కారణంగా దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న రాజమహేంద్రవరంలోని లాలాచెరువు-హౌసింగ్ బోర్డు వద్ద నుంచి ఆటోనగర్ వరకు జాతీయ రహదారిపై వాహనచోదకులు నెమ్మదిగా ప్రయాణించాలని కోరారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయించినట్టు డీఎఫ్‌వో భరణి చెప్పారు.

ఎకరానికి పది కాదు 25వేలు పరిహారం ఇవ్వాలి

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని విమర్శ
- పెద్దాపురంలో నీట మునిగిన పంట పొలాల పరిశీలన

పెద్దాపురం, సెప్టెంబరు 12: ఏలేరు ఆధునికీకరణపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఏలేరు వరద ఉధృతి కారణంగా కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణ శివారులో నీట మునిగిన పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఎకరానికి ఎంత పెట్టుబడి పెట్టారని రైతులను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఏలేరు వరద రైతులను నిండా ముంచిందన్నారు. రైతులు ఇప్పటికే రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జగన్, చంద్రబాబు తప్పుమీది అంటే మీదని నిందలు వేసుకుంటున్నారని, పదేళ్లుగా ఆధునికీకరణపై ఇద్దరికీ పట్టింపు లేదన్నారు. జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని, డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పట్టింపులేదని, తట్టమట్టి కూడా తీసిన పాపాన పోలేదని విమర్శించారు. చంద్రబాబు ఎకరానికి రూ.10వేలు ఇస్తే సరిపోదని, రూ.25వేలు పరిహారం రైతులకు ఇవ్వాలన్నారు. జగన్ గతంలో రూ.4వేలు పరిహారం ఇచ్చి మోసం చేశారన్నారు. పర్యటనలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల దొరబాబు, మాదేపల్లి చిట్టిబాబు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, మారోతి గణేష్, నీరుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



పాత పెద్దాపురంలో వంతెన పైనుంచి ఏలేరు వరద ఉధృతిని చూస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



రైల్వే అధికారులూ ఇది సబబేనా?



ఈ ఫొటోలు చూస్తే వామ్మో.. అనిపిస్తోందా?.. కింద ఉగ్ర గోదావరి, పైన ఫుట్‌పాత్ అంచున పనులు.. కచ్చితంగా గుండె ఝల్లుమంటుంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ జీవులు పనిలో నిమగ్నమై వున్నారు. అడుగు తడబడితే బతుకు గోదారిలో కలిసిపోతుంది. కుటుంబం అనాథగా రోడ్డున పడుతుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు బ్రిడ్జిపై పాత సిమెంట్ రెయిలింగ్ తీసేసి కొత్తగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేసే పనులను రైల్వే బ్రిడ్జి విభాగం ఆధ్వర్యంలో చేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా గోదావరి వరద ఉధృతంగా ఉంది. ఈ నెల 11న రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేశారు. గణేశ నిమజ్జనాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కానీ ఇవేమీ రైల్వే అధికారులకు కానరాలేదు. ఇన్నాళ్లూ వదిలేసి ఇప్పుడే ముహూర్తం అన్నట్లుగా కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు చేయిస్తున్నారు. సిమెంటు రెయిలింగ్ పిల్లర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించే పనిని ఇద్దరు వ్యక్తులు చేస్తున్నారు. ఏమాత్రం ఆదమరుపుగా అడుగు ముందుకు పడినా, దిమ్మెను గోదావరిలోకి తోసే క్రమంలో తూలినా వారు జలసమాధి కావడం ఖాయం. ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వీళ్లను చూస్తూ అటుగా వెళ్లే జనం అయ్యో! అనుకుంటూ.. బడుగు జీవుల బతుకులంటే అంత చులకనా? అంటూ రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న ఉధృతి

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 12: గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు 15.30 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం 8 గంటల పాటు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి అత్యధికంగా 15,33,399 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి నీటిమట్టంలో తగ్గుదల నమోదయింది. నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం 10గంటల వ్యవధిలో 9 పాయింట్ల మేర తగ్గి సాయంత్రం 6 గంటలకు 14.50 అడుగులకు చేరుకుంది. 13,92,111 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఎగువన భద్రాచలం వద్ద నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటలకు 41.50 అడుగులుగా నమోదైంది.



హరిహర సదన్ కాటేజీపై సోలార్ ఫలకలు అమర్చుతున్న దృశ్యం

రూ.3.15 కోట్లతో సోలార్ రూఫ్ టాప్

అన్నవరం, సెప్టెంబరు 12: సత్యగిరి కొండపై ఉన్న హరిహర సదన్, శివ సదన్, విష్ణు సదన్ నిర్మాణాలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు ప్రక్రియను అన్నవరం దేవస్థానం విద్యుత్ విభాగ అధికారులు గురువారం ప్రారంభించారు. దీనికి సుమారు 3.15 కోట్లు వ్యయం కానుండగా ఏడాదికి 9వేల యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సత్యగిరిపై రెండు కాటేజీల్లో 272 గదులు, వివాహాలకు 36 హాల్స్ ఉన్నాయి. ఈ పనిని నెడ్‌క్యాప్‌కు అప్పగించనుండగా పదేళ్ల పాటు నిర్వహిస్తుంది. ఐదేళ్లలో దేవస్థానం పెట్టిన పెట్టుబడి సమకూరి అనంతరం విద్యుత్ మిగులులోకి వస్తుందని అధికారులు చెప్పారు.



పవిత్రాలతో ఆలయ అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

అంతర్వేది, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్సోతవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి పూజలు జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు అంకురారోపణ, అదివాసాలు నిర్వహించారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశాలు, సర్వ ప్రాయశ్చిత్తార్థం నాలుగు రోజుల పాటు పవిత్సోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

నేడు మాజీ సీఎం జగన్ పర్యటన

ఏలేరు వరద ముంపు ప్రాంతాల సందర్శన

పిఠాపురం, సెప్టెంబరు 12: ఏలేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం కాకినాడ జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయల్దేరి పాత ఇసుకపల్లి మీదుగా పిఠాపురం మండలం మాధవపురం చేరుకుంటారు. 11 నుంచి 11.20 గంటల వరకు వరద బాధితులను పరామర్శించి 11.35 గంటలకి కొత్తపల్లి మండలం నాగులాపల్లి చేరుకుని వరద ప్రాంతాలను పరిశీలిస్తారు. 12.10 గంటలకు రమణక్కపేట చేరుకుని వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 12.45 గంటలకు పిఠాపురంలో హెలిపాడ్ వద్దకు చేరకుని తాడేపల్లి వెళ్తారు. జగన్ పర్యటించే ప్రాంతాలను మాజీ ఎంపీ వంగా గీత గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. పిఠాపురంలోని హెలిపాడ్, మాధవపురం అండర్‌పాస్ బ్రిడ్జి, మాధవపురం గ్రామాల్లో పర్యటించారు.

వెంకన్న ఆలయంలో ఐడీబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఐడీబీఐ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ శరత్, జనరల్ మేనేజర్ కె.దాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,23,435 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ బి.శ్రీనివాసరావు

పెరిగిన గోదావరి ఉధృతి

- జల దిగ్బంధంలో లంక గ్రామాలు
- పడవలపై బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ



కోటిపల్లి పుష్కరాల రేవులో పై మెట్లవరకు చేరిన వరదనీరు

కె.గంగవరం, సెప్టెంబరు 12: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. బుధవారం నాటి కంటే గురువారం నాటికి రెండు అడుగుల మేర పెరిగింది. ఫెర్రీరేవు, రేవులోని దుకాణ సముదాయం స్థానిక మత్స్యకార కాలనీ, మాధవనగర్‌లోకి వరదనీరు చేరుకుంది. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం స్థానిక కూటమి నాయకులతో కలిసి గోదావరి ఉధృతిని పరిశీలించారు. మాధవనగర్‌లో పడవపై వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. శేరిలంకలో వరద పరిస్థితిని కూడా టీడీపీ నాయకులు పరిశీలించారు. టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న, పెమ్మాడి సత్తిబాబు, తమ్మా చిన్నా, కొండేపూడి అర్జున్, గుత్తుల శ్రీనివాసరావు, వె య్యల మాణిక్యం, బీర అప్పారావు, సత్తిబాబు, సూరిబాబు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లి, లంక గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో తీర ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు. మూడుసార్లు వరద ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు లేక, పశుగ్రాసం కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

యానాంకు పెరిగిన వరద

యానాం: యానాం నియోజవర్గంలో వరద ప్రవాహ ఉధృతి మరింత పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలు ప్రభావంతో గోదావరికి వరద నీరు పోటెత్తడంతో యానాం జీఎంసీ బాలయోగి వారధివద్ద వరద ప్రవాహం నిలకడగా సాగుతుంది. ధవళేశ్వరం నుంచి వరద నీరు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి గుండా సముద్రంలోకి చేరుతుంది. యానాం రాజీవ్‌గాంధీ బీచ్- ఫెర్రిరోడ్డుపైకి వరద నీరుచేరడంతో అధికారులు పూర్తిగా రాకపోకలు నిలిపివేశారు. ముంపు ప్రాంతాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌లు విడివిడిగా పరిపాలనాధికారి మునిస్వామి, ప్రజాపనులశాఖ అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

ఆలమూరు: ప్రస్తుతానికి ఆలమూరు పరిధిలో ప్రమాదస్థాయిలోనే వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూములలో భారీగా వరద నీరు చేరడంతో వాణిజ్య పంటలు నీటమునిగి ఉన్నాయి. వరద నష్టం అపారంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి ఉధృతి అధికంగా ఉండటంతో ప్రవాహం జోరుగా ఉంది. జొన్నాడ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఆలయాలు ముంపునకు గురయ్యాయి.

కపిలేశ్వరపురం: మండలంలో వరద తగ్గుముఖం పట్టడంతో లంకగ్రామాలైన అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక, కేదార్లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ప్రాంతాలను, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఫ్లడ్ అధికారులతో కలిసి తహసీల్దార్ చిన్నారావు గురువారం పరిశీలించారు. గ్రామాల్లో పరిస్థితులను ప్రజలను, సిబ్బందిని, అడిగి తెలుసుకున్నారు. వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. నారాయణలంకలో అంగర, వానపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తహసీల్దార్ చిన్నారావు తనిఖీ చేశారు. చేశారు.

మునిగిన లంకలు

రావులపాలెం: గోదావరికి వరద నీరు పోటెత్తిన నేపథ్యంలో లంక పొలాలు ముంపు బారిన పడ్డాయి. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ఠ పరివాహక ప్రాంతంలోని లంకపొలాలు ముంపుబారిన పడ్డాయి.

ఇళ్లను తాకుతున్న వరద

ఆత్రేయపురం: గోదావరికి వరదనీరు పోటెత్తడంతో గురువారం కాస్త నిలకడగా ఉంది. బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద ఎర్రనీరు ప్రవహిస్తోంది. పిచ్చుకలంక ప్రాంతంలో నివసిస్తున్న ఇండ్లను వరదనీరు ముంచెత్తింది. కాస్త పెరిగితే ఇళ్లలోకి వరదనీరు చేరుతుంది. లంక ప్రాంతాల్లో పాడిపశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గ్రామాల్లో ఉన్న ముఖ్య ప్రాంతాల వద్ద పడవలను ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి పర్యటించారు. అధికారులను అప్రమత్తం చేశారు.

పెరిగిన వైనతేయ వరద

అల్లవరం : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వైనతేయ గోదావరి ఉగ్రరూపం దాల్చి వరద పెరిగింది. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో 90ఇళ్లు, గోపాయిలంకలో 9 ఇళ్లు వరద ముంపు బారిన పడ్డాయని తహసీల్దారు వీవీఎల్ నరసింహారావు తెలిపారు. బోడసకుర్రులో 90 కుటుంబాలకు చెందిన 400 మందికి పడవలపై వెళ్లి ఆహార పొట్లాలు పంపి ణీ చేశారన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, తహసీల్దారు నరసింహారావు, ఎంపీడీవో కృష్ణమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్, ఏఈ జి.స్వామి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, చింతా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, ఆర్ఐ ఎం.దుర్గాశ్రీనివాస్, ఓలేటి పరమేశ్వరరావు, పశువైద్యాధికారి నారాయణరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లో వరదనీరు

జలదిగ్బంధంలో 192 గృహాలు

కాట్రేనికోన: వృద్ధగౌతమి వరద ఉధృతికి 192 ఇళ్ల చుట్టూ నీరు చేరిందని తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ తెలిపారు. కుండలేశ్వరం టన్నెల్ వద్ద 8, నడవపల్లిపల్లిపాలెంలో 140, పల్లంకుర్రురేవులో 44 ఇళ్లు జలదిగ్బంధంలో ఉన్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారి ఎం.ఝాన్సీరాణి పర్యటించి బాధితులకు సూచనలు చేశారు. పల్లిపాలెం, పల్లంకుర్రురేవుల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, లాక్‌పేట, సఖినేటిపల్లిలంక వదర ప్రభావిత ప్రాంతాలను తహసీల్దార్ సీహెచ్‌భాస్కర్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్‌లు గురువారం పరిశీలించారు. ముందుగా వరద బాధితులకు తాగునీరు, ఆహార పొట్లాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు రాకపోకలకు సంబంధించి పడవలు సిద్ధంగా ఉంచాలని, పడవల్లో ప్రయాణించే వారులైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. వరద ప్రాంత బాధితుల కోసం వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.



లంక గ్రామాల్లో బాధితులతో మాట్లాడుతున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్

వరద బాధితులను ఆదుకుంటాం : ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, సెప్టెంబరు 12: వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాకుమార్‌లు పేర్కొన్నారు. వరద ప్రభావిత గ్రామాలైన లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక గ్రామాల్లో గురువారం వారు పర్యటించారు. బాధితులకు ప్రభుత్వం అందించే సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి లంక భూములకు రివిట్‌మెంట్ నిర్మించి నదీకోత నుంచి గ్రామాలను కాపాడతామని ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోయారన్నారు. విపత్తు సమయంలో బాధితులను ఆదుకోవడం, సహాయక చర్యలు చేపట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విపత్తు నిధులు మంజూరు చేయించి లంక గ్రామాల రక్షణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, గుద్దటి జమి, చిక్కాల అంజిబాబు, తాడి జానకీరామ్, యాళ్ల ఉదయ్, రంకిరెడ్డి రాంబాబు, మోర్త ప్రసాద్, నడింపల్లి శ్రీనివాసరాజు, దంగేటి శ్రీనివాస్, గోదశి పుండరీష్, దూడల స్వామినాయుడు, గోదశి గణేష్, తొత్తరమూడి జ్యోతిబాబు, మేడపాటి వంశీ, రమేష్‌లతో పాటు పలువురు ఉన్నారు.

వరద ఉధృతిని బట్టి నీరును వదులుతున్నాం: ఇరిగేషన్ ఈఈ

పి.గన్నవరం, సెప్టెంబరు 12: గోదావరి వరద ఉధృతి ప్రస్తుతం తగ్గుతుందని, బలహీనంగా ఉన్న ఏటిగట్లు వద్ద మాత్రం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఇరిగేషన్ ఈఈ బి.శ్రీనివాసరావు తెలిపారు. వరద ఉధృతికి అనుగుణంగా ఏటిగట్లుకి ఇబ్బంది లేకుండా సాగునీటిని కాల్వల్లోకి విడుదల చేస్తున్నామని చెప్పారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. కాల్వల్లో గోదావరి తీర ప్రాంతాలలో చెత్త లేకుండా చూడటంతో పాటు ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. అనంతరం వైనతేయ బ్యాంక్ కెనాల్, వశిష్ట లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కె.ముంజవరం అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను ఆయన పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. ఈఈ వెంట హెడ్ వర్క్స్ జేఈ రాధకృష్ణ, ఇరిగేషన్ జేఈలు ఎ.నాయుడు, సుందర్‌సింగ్ ఉన్నారు.

విజయదశమి ఉత్సవ కమిటీల సమావేశం

అమలాపురంటౌన్, సెప్టెంబరు 12: అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గురువారం పట్టణంలోని విజయదశమి ఉత్సవ కమిటీల సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న ఏడు వీధులైన కొంకాపల్లి, మహిపాలవీధి, గండువీధి, రవణం మల్లయ్యవీధి, రవణంవీధి, నల్లావీధి, శ్రీరామపురానికి చెందిన ఉత్సవ కమిటీల పెద్దలు సమావేశంలో పాల్గొన్నారు. దసరా ఊరేగింపు అక్టోబరు 12వ తేదీ శనివారం నిర్వహించేందుకు అన్ని కమిటీల సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు.

సామూహికంగా ఎలుకలను నివారించాలి

- కమిషనర్ కార్యాలయ డీడీఏ వెంకటేశ్వర్లు

అంబాజీపేట, సెప్టెంబరు 12: రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయ డీడీఏ డి.వెంకటేశ్వర్లు సూచించారు. ఇరుసుమండలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అధ్యక్షతన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం ఉచితంగా రైతులకు బ్రోమోడయాలిన్ మందును అందిస్తుందన్నారు. వీటిని నూనె, నూకలతో కలిపి ఎలుకల బొరియల వద్ద పెట్టాలన్నారు. మరుసటిరోజు తెరుచుకున్న బొరియలను మూసివేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఏఈవో డి.దుర్గారావు, రైతులు అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, దంతులూరి గాంధీరాజు, మామిడిశెట్టి బలరామకృష్ణ, శ్రీనివాసరావు, కొప్పిశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12: చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరూరు, హైస్కూలు, ఎస్కేబీఆర్ కళాశాల, హౌసింగ్‌బోర్డు కాలనీ, వెంకటేశ్వరస్వామి టెంపుల్ 11కేవీ ఫీడర్ పరిసరాల్లో ట్రీ కటింగ్, మెయింటెనెన్స్ నిమిత్తం విద్యుత్‌ను నిలుపుదల చేస్తామన్నారు. ఈదరపల్లి శివాలయం రోడ్డు, రెడ్ల కాలనీ, సుబ్బారాయుడుచెరువుగట్టు, వడ్డిగూడెం, భూపయ్య అగ్రహారం, తారకరామానగర్, గాంధీనగర్, శ్రీరామపురం, విత్తనాల వారికాల్వగట్టు, కల్వకొలనువీధి, నల్లాగార్డెన్స్, మహిపాలవీధి, పేరమ్మ అగ్రహారం, ఎర్రవంతెన ఏరియా, కొంకాపల్లి, ఏవీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏచూరి మృతి ఉద్యమాలకు తీరని లోటు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారామ్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, సఖిలే సూర్యనారాయణ పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సీతారామ్ ఏచూరి పార్టీకి అందించిన సేవలు, చేసిన ప్రజా ఉద్యమాల గురించి వివరించారు. జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, బి.వెంకట్రావు, పొలమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో సీతారామ్‌కు నివాళులర్పించారు.

వరద బాధితులకు సత్యాస్కాన్ అధినేత రూ.10 లక్షలు విరాళం



మంత్రి లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న కాదా వెంకటరమణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సత్యాస్కాన్ అధినేత డా.కాదా వెంకటరమణ రూ.10లక్షలు ఆర్థికసాయం సీఎం సహాయనిధికి అందజేశారు. గురువారం విజయవాడలో మంత్రి సుభాష్‌తో కలసి మంత్రి లోకేష్‌కు రూ.10 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, అక్కల రిష్వంత్‌రాయ్, గంధం పల్లం రాజు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, కాకర్లపూడి కృష్ణంరాజు పాల్గొన్నారు

'జీవో 85ను తక్షణం రద్దుచేయాలి'



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యుల బృందం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12: కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బంది ఇన్‌సర్వీసు కోటాను తగ్గించడం అన్యాయమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లాశాఖ సమావేశంలో పలువురు పేర్కొన్నా రు. ఇన్‌సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 85ను తక్షణం రద్దు చేయకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అమలాపురంలో గురువారం జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం సమావేశం నిర్వహించారు. ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సమ్మె నోటీసును అందించామన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామని తెలిపారు. ఈనెల 14 నుంచి అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమవుతామని తెలిపారు. వైద్య సేవలకు అంతరాయం కలిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జీవోను రద్దు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని ప్రకటించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఫణికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మణికుమార్, కార్యదర్శి డాక్టర్ జి.ఇంద్రావతి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎల్.నాగార్జున, కోశాధికారి డాక్టర్ సత్యంతో పాటు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొరకు వినతిపత్రం అందజేశారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ఆత్రేయపురం, సెప్టెంబరు 12: పోస్టుగ్రాడ్యుయేషన్ వైద్యవిద్యలో 30 శాతం ఇన్‌సర్వీసు కోటాగా ఉన్న సీట్లను 15 శాతానికి తగ్గించడాన్ని వైద్యులు తీవ్రంగా నిరసిస్తున్నారు. బుధవారం ఆత్రేయపురం, ర్యాలి పీహెచ్‌సీలలో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 85 జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సౌమ్య, హైమా తదితరులు పాల్గొన్నారు.

బకాయి పడ్డ జీతాలు చెల్లించాలంటూ.. కలెక్టరేట్ ఎదుట స్కూలు శానిటేషన్ వర్కర్లు ధర్నా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12: ఆరు నెలల వేతన బకాయిలను చెల్లించాలని, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్న ప్రధాన డిమాండ్లతో జిల్లాలోని స్కూల్ శానిటేషన్ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు మాపూరి భాస్కరరావు, శానిటేషన్ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడిశెట్టి కుసుమ మాట్లాడారు. ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలు గడవని పరిస్థితి ఏర్పడిందని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, ఏకరూప దుస్తులు అందించి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు విజయ, దుర్గ, వరలక్ష్మి, మహాలక్ష్మి, గంగాభవాని పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

కొత్తపేట, సెప్టెంబరు 12: డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా ఉపాధి కార్యాలయం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయాధికారి సీహెచ్ రాజకుమార్ కోరారు. గురువారం విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన కళాశాల ప్లేస్‌మెంట్‌సెల్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ రాజకుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్, పోస్టల్, రైల్వే, పోలీస్, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. డిగ్రీ పూర్తైన నిరుద్యోగ యువతి, యువకులు పోర్టల్‌లో నమోదై ఉంటే తప్పనిసరిగా అవకాశాలు వస్తాయని తెలిపారు.

వరద బాధితులకు సాయం

రావులపాలెం, సెప్టెంబరు 12: రావులపాలెం మండలం ఊబలంకలో ఉన్న మదర్‌థెరెస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విజయవాడ వరద బాధితులకు సాయం పంపిణీ చేశారు. దుప్పట్లు, టవల్, వాటర్ బాటిల్, డ్రింక్, స్నాక్స్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, దోమల చక్రాలతో కూడిన కిట్లను విజయవాడ వెళ్లి వరద బాధితులకు అందించారు. డాక్టర్ నల్లమల్లి సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ సూర్య, విజయవర్ధనరావు, కర్రి రామసందీప్‌రెడ్డి, కర్రి రామకౌశికరెడ్డి సహకారంతో సంస్థ ఫౌండర్ చైర్మన్ దిడ్ల కిశోర్, సభ్యులు మారే ప్రేమ్‌నివాస్, మారే రాంబాబు, మల్కా పండు తదితరులు విజయవాడలో వరద బాధితులకు కిట్లను పంపిణీ చేశారు.

సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మృతి

అల్లవరం, సెప్టెంబరు 12: కొమరగిరిపట్నానికి చెందిన శెట్టిబలిజ సంఘ పెద్ద, ఎంఆర్‌ఎం సహకార సొసైటీ మాజీ వైస్ చైర్మన్ యాండ్ర వెర్రియ్య(80) మృతిచెందారు. వెర్రియ్య కుటుంబాన్ని ఇళ్ల శేషగిరిరావు తదితరులు పరామర్శించారు. యాండ్ర వెర్రియ్య మృతిపట్ల సొసైటీ సీఈవో కొమ్మూరి సత్తిబాబు, కడలి రామకృష్ణశెట్టి, విజయ్, శ్రీనివాస్, మంతెన సురేష్‌రాజు సంతాపం తెలిపారు.

రూ 2.88 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు ఆమోదం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ద్రాక్షారామ, సెప్టెంబరు 12: రామచంద్రపురం మండల అత్యవసర సర్వసభ్యసమావేశంలో ఉపాధి హామీ పథకంలో రూ.2.88కోట్లతో ప్రతిపాదించిన 63 పనులకు మండల పరిషత్ సర్వసభ్య అత్యవసర సమావేశం ఆమోదించింది. గురువారం రామచంద్రపురం మండల సర్వసభ్య అత్యవసర సమావేశం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కాపవరం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్ మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పనుల ఎంపిక, మంజూరు చేసి గ్రామసభల్లో పంపేవారన్నారు. మెటీరియల్ కంపోనెంట్‌తో చేపట్టే పనులు మంజూరుచేసి మండల పరిషత్ సమావేశం ఆమోదానికి పంపేవారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతంలో జరిగిన తీరునుమార్చి గ్రామంలోనే పని ఎంపికలు చేసి గ్రామసభ ఆమోదంచేసి తదుపరి మండల సమావేశంలో ఆమోదం తెలపాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఆమోదం తరువాతే పనులు మంజూరు చేస్తారన్నారు. ఈవిధంగా స్థానిక సంస్థలకు ఎంపీటీసీలకు ప్రాధాన్యం కల్పించడం హర్షనీయమన్నారు.. సమావేశం అనంతరం పవన్‌కల్యాణ్ చిత్రపటానికి ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాలాభిషేకం చేశారు. మండలంలో 25 గ్రామాల్లో 1573పనులు రూ.69.93 కోట్లతో చేపట్టేందుకు గ్రామసభల్లో ఆమోదించారు. 60పనులు సీసీ రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి 2.88 కోట్లుతో గ్రామ సభల్లో తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శాకా బాబి, ఎంపీడీవో కీర్తి స్పందన, ఈవోపీఆర్డీ షలత్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకుల రెండో రోజు సమ్మె

మలికిపురం, సెప్టెంబరు 12: జీతాల కోసం సమ్మె చేస్తున్న మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమ్మె రెండో రోజుకు చేరింది. గత నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని తమకు మేనేజ్‌మెంట్ వెంటనే జీతాలు ఇవ్వాలంటూ గత రెండు రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. మొదటిరోజు కళాశాల కరస్పాండెంట్‌తో పెద్దలు సంప్రదించగా గురువారం ఇరువర్గాల సంప్రదింపులు ఉంటాయని హామీ ఇచ్చారు. కానీ కరస్పాండెంట్ తనకు ఆరోగ్యం బాగోలేదని సమావేశాన్ని వాయిదా వేశారు. దీంతో సమస్యకు పరిష్కారం రాలేదు. అధ్యాపకుల సమ్మెకు విద్యార్థులు కూడా సంఘీభావం ప్రకటించారు. మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు పలికారు. పలు ప్రజా సంఘాలు కూడా మద్దతు పలికాయి.

బీఎస్ఎన్ఎల్ టవర్లు పెంచాలి

మలికిపురం, సెప్టెంబరు 12: రాజోలు ఎస్‌బీఈ పరిధిలో మరిన్ని సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని జిల్లా టెలికాం మాజీ సలహా సంఘ మాజీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం పంపారు. రాజోలు ఎస్డీఈ పరిధిలో 22 సెల్ టవర్లు పనిచేస్తున్నాయని, మరికొన్ని టవర్లు పెంచితే సబ్ డివిజన్ పరిధిలో అన్ని గ్రామాలకు సెల్ సిగ్నల్ అందుబాటులో ఉంటాయన్నారు. బీఎస్ఎన్ఎల్ రేట్లు అందుబాటులో ఉండడంతో బీఎస్ఎన్ఎల్‌వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని టవర్లు పెంచాలన్నారు.

మద్దాల కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

మామిడికుదురు, సెప్టెంబరు 12: మామిడికుదురు మాజీ జడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి కుటుంబాన్ని మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. కృష్ణమూర్తి తమ్ముడు, టీడీపీ సీనియర్ నాయకుడు మద్దాల నాగబాబు భార్య అనంతలక్ష్మి సరస్వతి ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, అబ్బిరెడ్డి సురేష్, లింగోలు పెద్దకాపు, కోలా సత్తిబాబు తదితరులు ఉన్నారు.

జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు చిన్నబాబుకు రోడ్డు ప్రమాదం

మలికిపురం, సెప్టెంబరు 12: లక్కవరానికి చెందిన జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబురాజు రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యారు. గురువారం ఆయన్ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జనసేన నాయకుడు గుండుబోగుల పెదకాపు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మంగెన నాని, బందెల పద్మ పరామర్శించారు.

'విశ్వకర్మ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12: ఈ నెల 17న విశ్వకర్మ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ సెలవు దినంగా ప్రకటించినందున రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా సెలవు దినంగా ప్రకటించాలని దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ సంక్షేమ సేవా సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యాలయంవద్ద గురువారం కొనుకు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. చేతివృత్తుల ఆరాధ్య దైవమైన విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. గున్నేపల్లి బీమశంకరం, పితాని జేబిరావు, అబ్బులు, రమణ, ఈశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ

రాజోలు, సెప్టెంబరు 12: రాజోలులో నున్నవారి బాడవ, మేకలపాలెం వరద ప్రాంతాలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం సందర్శించారు. 180 మంది బాధితులకు ఆయన ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ రేవు జ్యోతి, మోకా పార్వతి, పినిశెట్టి బుజ్జి,తదితరులు పాల్గొన్నారు.

కేశవరం, జెడ్.మేడపాడులలో ఆర్‌వోబీల నిర్మాణం కోసం భూసేకరణ కోసం సర్వే

మండపేట, సెప్టెంబరు 12: మండలంలోని కేశవరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్మించే ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణం కోసం భూసర్వే పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. దక్షిణ మధ్యరైల్వేశాఖకు చెందిన రైల్వేశాఖ అధికారులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో కలిసి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. కేశవరంలో రైల్వేగేటువల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది, ఇక్కడ గేటుగుండా కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ జరుగుతున్న ట్రాఫిక్‌జాంను దృష్టిలో ఉంచుకుని రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులకు ప్రతిపాదించారు. గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురం ఆర్డీవో సుదాసాగర్, ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ, దక్షిణ మధ్య రైల్వేశాఖ ఇంజనీరింగ్ అధికారులు సుందర్‌సేన్, షాజన్, త్రినాధ్‌లు వంతెన నిర్మాణంకు సంబంధించిన పలు అంశాలపై భూసేకరణకు స్థల పరిశీలన చేశారు. మండపేట మండలం జెడ్.మేడపాడులో నిర్మించే రైల్వే వంతెన నిర్మాణంకోసం ఎటువంటి ప్రభుత్వ లేదా ప్రైవేటు స్థల సేకరణ అవసరంలేదని కేవలం వంతెన చివర భాగం జెడ్ మేడపాడు శివారు తుంగపాడు వైపు వెళ్లేచోటు రెండు ఇళ్లకు కొంతమేర నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని అధికారులు గుర్తించారు. రెండు చోట్లు వంతెన అవశ్యకతను స్థానిక అధికారులు రైల్వే అధికారులకు ఎమ్మెల్యే వేగుళ్ల వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు పెదపాటి సత్యన్నారాయణ, కంచర్ల చంద్రశేఖర్, మండల తహసీల్దార్ తేజేశ్వరరావు, ఈవోపీఆర్డీ రాజు, పంచాయతీ కార్యదర్శులు, సుబ్బారావు, అమర్‌నాథ్‌చౌదరి, టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎంపీ గంటి, ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం, సెప్టెంబరు 12: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. జి.వేమవరం జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో జరిగిన ఆటల పోటీలను గురువారం ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం సలాది వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నల్ల సుదర్శన్‌రావు, గుత్తెనదీవి సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, దాట్ల పృథ్వీరాజు, దాసరి జగదీశ్వరి, సాకా సీతాదేవి, పెంట రవి, ఎస్ఎంసీ చైర్మన్ బసవా అప్పారావు, ఎంఈవో తిరుమలరావు, చోడిశెట్టి బ్రహ్మానందం, కొండమూరి విజయబాబు, మద్దింశెట్టి పురుషోత్తం, పీడీలు అడబాల విజయశ్రీనివాసరావు, ఈశ్వరరావు, టి.రాంప్రసాద్, కళావతి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఐ.పోలవరం, సెప్టెంబరు 12: గోదావరి ఉధృతికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోగుల్లంక, భైరవలంకల్లో లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారి వి.బోసుబాబు, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో భరత్‌కుమార్ పర్యటించారు. గోదావరి తీరం వెంబడి ఉన్న ఆక్వా రైతులు తమ చెరువులను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అన్నదాన ట్రస్టుకు లక్ష విరాళం

ఐ.పోలవరం, సెప్టెంబరు 12: రాజమహేంద్రవరానికి చెందిన ఝాన్సీవిజయలక్ష్మి వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు గురువారం రూ.1,00,116లు విరాళంగా ఇచ్చారు. స్వామి కటాక్షంతో తాము సొంత గృహం ఏర్పాటు చేసుకున్నామని దాత ఆనందం వ్యక్తం చేశారు. దాతకు స్వామి చిత్రపటం అందించారు.


జంగిల్ క్లియరెన్సు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, సెప్టెంబరు 12: పెద్దెనిమిది ఎకరాల కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్సు పనులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకురావాలని పాఠశాల ప్రిన్సిపాల్ లలితకుమారికి సూచించారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, సర్పంచ్ నక్కా రామారావు, కడలి ఏడుకొండలు, అడబాల విజయ్, పినిశెట్టి బుజ్జి, కోళ్ల బాబి, నామన షణ్ముక్, ఎం.సురేష్ పాల్గొన్నారు.

దవులూరికి చేయూత పురస్కారం

ద్రాక్షారామ, సెప్టెంబరు 12: ద్రాక్షారామకు చెందిన సంఘసేవకుడు దవులూరి రామకృష్ణను స్వచ్ఛంద సంస్థ విశిష్టసేవా పురస్కారానికి ఎంపిక చేసినట్టు జిల్లా సైన్సు అధికారి చేయూత సభ్యుడు గిరిజాల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆ సంస్థ వార్షికోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో 20 మందికి సేవాపురస్కారాలు అందచేస్తుందని సుబ్రహ్మణ్యం తెలిపారు. ద్రాక్షారామకు చెందిన రామకృష్ణ సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 14విశిష్ట సేవాపురస్కారం అందజేస్తారని తెలిపారు.

కేశవరంతో ఏచూరి కుటుంబానికి అనుబంధం



మండపేట, సెప్టెంబరు12: ప్రముఖ కమ్యూనిస్టునేత సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72)మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. గత కొంతకాలం నుంచి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సీతారాం ఏచూరి మండపేట మండలం కేశవరంలో కొంతకాలం ఆయన కుటుంబం నివాసం ఉంది. ఏచూరి రామారావు విద్యాపీఠంపేరిట కొంతకాలం ఇక్కడ విద్యాలయం నిర్వహించారు. అనంతరం పీఠంను కుటుంబ సభ్యులు వేరేవారికి విక్రయించారు. సీతారాం కుటుంబ సభ్యులు కొంతకాలంపాటు ఇక్కడ నివాసం ఉన్నారని బాల్యంలో సీతారాం ఇక్కడకు వచ్చిన సందర్భంఉందని స్థానికులు తెలిపారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, జిల్లాకాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణి, పట్టణ సీతారామ బ్రహ్మణ సంఘం, బ్రహ్మణ సంఘీయులు, వీర్రాజు, శివకోటిశేష సుబ్రహ్మణ్యం, కేసరి విద్యాసాగర్, గరిమెళ్ల నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సూర్యనారాయణ, కె. బాస్కరకామరాజు సంతాపం తెలిపారు.